ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 1
మార్చి 2025








**ఈ నెల 7న ఎదుర్కోలు,**
**8న తిరుకల్యాణమహోత్సవం**
**9న దివ్య విమాన రథోత్సవం**
**బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం**
**రూ.3.15 కోట్ల బడ్జెట్ కేటాయింపు**
**11న అష్టోత్తర శతఘటాభిషేకంతో**
**పరిసమాప్తి కానున్న బ్రహ్మోత్సవాలు**
**బ్రహ్మోత్సవాలు జరిగే 11 రోజులు**
**ఆలయంలో ఆర్జిత సేవలు బంద్**



# నేటి నుండి 11 వరకు యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: "బ్రహ్మోత్సవం...ఇది బ్రహ్మోత్సవం....యాదగిరి నరసింహ బ్రహ్మోత్సవం" అని భక్తులు పాడుకుంటూ తనువు...మనసు ఏకం చేసి తాము ఆర్తిగా కొలుచుకునే యాదగిరి నరసింహ బ్రహ్మోత్సవాలలో పాల్గొనే సమయం వచ్చేసింది. ఆలయ అర్చకులు... వేదపండితులు అధికార గణమంతా ఒక్కటై 11 రోజుల బ్రహ్మోత్సవ సంబరంభానికి శనివారం స్వస్తి వాచనంతో అంకురార్పణ చేయనున్నారు. రాష్ట్ర గవర్నర్ జష్ణు దేవ్ వర్మ,, రాష్ట్ర మంత్రులు, రాష్ట్రంలోని సబ్బండ అధికార ఘనం శ్రీలక్ష్మీ నరసింహుని సేవలో పాల్గొని తరించేందుకు ప్రణాళికలు అన్ని దేవస్థానం అధికారులు పూర్తి చేశారు. ఉత్సవాల్లో విశేష పర్వాలైన 7న ఎదుర్కోలు మహోత్సవం, 8న దివ్య కల్యాణ మహోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం ఆదివారం కన్నులపండువుగా నిర్వహించనున్నారు. సినీ రంగ ప్రముఖులు, ధార్మిక, సాహిత్య, సంగీత మహా సభలలో ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు యాదగిరి కొండను సుసంపన్నం చేయనున్నాయి.



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. యాదర్శి తప్పు బలానికి ప్రతీకగా నిలిచిన యాదగిరిగుట్ట నేడు కొట్లాదిమంది భక్తులకు కొంగు బంగారం. మహిమాన్వితమై విరాజిల్లుతున్న యాదగిరిగుట్టలో ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం పరిపాటి అందులో భాగంగానే నేటి నుండి మార్చి 11 వరకు 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయ ఆఫీసర్లు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. శనివారం ఉదయం స్వస్తివాచనంతో ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా యాదగిరిగుట్టకు వచ్చే ప్రధాన రహదారుల్లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు రాష్ట్ర మంత్రులు చాలా వరకునూత్సవాల్లో పాల్గొననున్నారు. ప్రముఖులతో పాటు రాష్ట్రంలోని ప్రధానాలయాలకు ప్రత్యేక ఆహ్వాన లేఖలు పంపారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రత్యేక లైటింగ్ తో పాటు స్పెషల్ సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్టకు వచ్చే అన్ని ప్రధాన రహదారుల్లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఇక పూర్తిగా కృష్ణశిలతో సప్తగోపుర సముదాయంగా నిర్మించిన ప్రధానాలయానికి లేజర్ లైటింగ్, యాదగిరికొండకు ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ ఏర్పాటు చేశారు. రకరకాల పూలతో ఆలయాన్ని చూడముచ్చటగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని ప్రధానాలయాల నుండి యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సులను నడపడానికి ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మార్చి 8న రాత్రి స్వామివారి కల్యాణం సందర్భంగా.. తిరుగు ప్రయాణ భక్తుల కోసం లేట్ నైట్ వరకు బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా శనివారం నుండి 11 వరకు.. 11 రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు అన్ని రకాల వాహనాలను కొండపైకి ఉచితంగా అనుమతించడానికి ఆలయ ఆఫీసర్లు నిర్ణయం తీసుకున్నారు.

## స్వస్తివాచనంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

యాదాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న(శనివారం) స్వస్తివాచనంతో మొదలై 11న అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగియనున్నాయి. 11 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యం నిర్వహించే ఆర్జిత సేవలు, సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవ పూజలను తాత్కాలికంగా రద్దు చేశారు. శనివారం విష్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 2న ధ్వజారోహణం ద్వారా గరుడ ముద్దలు ఎగరేసి నరసింహుడి కల్యాణానికి సకల దేవతలను ఆహ్వానించనున్నారు. ఇక బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టాలైన 7న ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం, 9న రథోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 11 రోజుల పాటు ఆర్జిత సేవలు, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, జోడు సేవలు, ఏకాదశిన నిర్వహించే లక్షపుష్పార్చనను తాత్కానికంగా రద్దు చేశారు.

## ఈ నెల 3 నుండి నారసింహుడి అలంకార సేవలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 3 నుండి ప్రధానాలయ ప్రాంగణంలో స్వామివారి వివిధ రకాల అలంకార, వాహన సేవలను నిర్వహించనున్నారు. 3న ఉదయం మత్స్యాలంకార సేవ, రాత్రి శేషవాహన సేవ.. 4న ఉదయం వటపత్రశాయి, రాత్రి హంసవాహన సేవ నిర్వహించనున్నారు. ఇక 5న ఉదయం శ్రీకృష్ణ(మురళీకృష్ణుడు) అలంకార సేవ, రాత్రి పొన్నవాహన సేవ.. 6న ఉదయం గోవర్ధనగిరిధారి, రాత్రి సింహవాహన సేవ జరపనున్నారు. ఇక 7న ఉదయం జగన్మోహిని అలంకార సేవ, రాత్రి అశ్వవాహన సేవ చేపట్టి ఎదుర్కోలు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. 8న ఉదయం హనుమంత వాహనంపై శ్రీరామ అలంకార సేవ, రాత్రి 8 గంటలకు గజవాహన సేవ చేపట్టి లక్ష్మీనారసింహుల తిరుకల్యాణం జరపనున్నారు. 9న ఉదయం గరుడ వాహనంపై మహావిష్ణు అలంకార సేవ, రాత్రి 7 గంటలకు దివ్యవిమాన రథోత్సవం.. 10న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగం, దేవతా ఉద్వాసన నిర్వహించనున్నారు. ఇక చివరగా 11న నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

## బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం రూ.3.15 కోట్ల బడ్జెట్

నారసింహుడి దివ్యవిమాన గోపురానికి స్వర్ణతాపడం ఏర్పాటు, కుంభ సంప్రోక్షణ మహోత్సవాల తర్వాత జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు కావడంతో.. ఉత్సవాల నిర్వహణ కోసం దేవస్థానం భారీ బడ్జెట్ కేటాయించింది. ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి రూ.3.15 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించింది. ఆలయ చరిత్రలో ఇదే అత్యధిక బ్రహ్మోత్సవాల బడ్జెట్ అని ఆలయ ఆఫీసర్లు చెప్తున్నారు. ఇక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రధాన ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మరోవైపు ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అందంగా అలంకరించారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో.. స్వామివారిని ఈ నెల 3 నుండి 9 వరకు రోజుకు రెండు అలంకారాల్లో ఆలయ మాడవీధుల్లో విహరింపజేయనున్నారు. దీనికి అవసరమయ్యే వాహన సేవలు, పల్లకి సేవలను సిద్ధం చేశారు. గరుడ, సింహ, అశ్వ, గజ, మత్స్య, హంస, పొన్న, శేష వాహన సేవలను శుభ్రం చేసి ఉత్సవాలకు రెడీగా ఉంచారు. హోమాలు చేయడానికి ప్రధానాలయ ఈశాన్యంలో యాగశాల ఏర్పాటు పనులు పూర్తి చేశారు.

## సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్ద పీట

బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు దేవస్థానం పెద్దపీట వేసింది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రధానాలయ ఉత్తర దిక్కున 80 ఫీట్ల వైశాల్యంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పలువురు ప్రముఖులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించానికి ఏర్పాట్లు చేశారు. మార్చి 1 నుండి 3 వరకు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నర్సింహారావుచే నృసింహ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం, 4న ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ చే భక్తి సంగీత విభావరి, 5న ప్రముఖ జానపద, సినీగాయకురాలు తేలు విజయతో భక్తి సంగీత కార్యక్రమం, 6న శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ చే అన్నమయ్య సంకీర్తన విభావరి, 7న పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ చే అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు, భక్తి సంగీతం, 9న లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు, సంగీత దర్శకుడు కోమండూరి రామాచార్యులచే మ్యూజికల్ ఈవెంట్ జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ ఆఫీసర్లు అన్ని ఏర్పాట్లు చేశారు.

## బ్రహ్మోత్సవాలలో నిర్వహించే ఉత్సవాల వివరాలు

01.03.2025: ఉదయం స్వస్తివాచనం, రక్షాబంధనం.. సాయంత్రం అంకురారోపణం, మృత్సంగ్రహణం

02.03.2025: ఉదయం అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం.. సాయంత్రం బేరిపూజ, దేవతాహ్వానం

03.03.2025: ఉదయం మత్స్యావతార సేవ, రాత్రి శేషవాహన సేవ

04.03.2025: ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ

05.03.2025: ఉదయం శ్రీకృష్ణ అలంకార సేవ, రాత్రి పొన్నవాహన సేవ

06.03.2025: ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి సింహవాహన సేవ

07.03.2025: ఉదయం జగన్మోహిని అలంకార సేవ.. రాత్రి అశ్వవాహన సేవ, ఎదుర్కోలు

08.03.2025: ఉదయం శ్రీరామ అలంకార సేవ, రాత్రి తిరుకల్యాణోత్సవం

09.03.2025: ఉదయం శ్రీమహావిష్ణువు అలంకారం గరుడ వాహన సేవ, రాత్రి రథోత్సవం

10.03.2025: ఉదయం మహాపూర్ణాహుతి, చక్రతీర్థం.. సాయంత్రం పుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం

11.03.2025: ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం





## బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

**- యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కర్ రావు**



ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేశాం. పలువురు ప్రముఖులతో సాంస్కృతిక కార్యక్రమాలు గొప్పగా నిర్వహించడా నికి అన్ని ఏర్పాట్లు చేశాం. వీఐపీలు ఎంతమంది వచ్చినా సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నాం. ఇక కల్యాణంలో పాల్గొనే భక్తుల కోసం కల్యాణ టికెట్లను అందుబాటులో ఉంచాం. కల్యాణ టికెట్ల ధరను రూ.3 వేలుగా నిర్ణయించి ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో అందుబాటులో పెట్టాం. కల్యాణంలో పాల్గొనే దంపతుల కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నాం. ఇక బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజూ 1000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నాం.

